క్లుప్తంగా

కాళికాంబకు ప్రత్యేక పూజలు


విశేష అలంకరణలో కాళికాంబదేవి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా శ్రీకాళికాంబదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం అనంతరం వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు. అమ్మవారికి ఒడి బియ్యం కార్యక్రమం జరిపించి మహామంగళ హారతులు ఇచ్చారు. అనంతరం రాహుః కాల పూజలు చేపట్టారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణలు చేపట్టారు. అలాగే.. కోటావీధిలో వెలసిన శ్రీరమాసమేత సత్యానారాయణస్వామి దేవస్థానంలో మహాలక్ష్మి, అన్నపూర్ణేశ్వరికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఓటర్ల జాబితా పరిశీలన

శిరివెళ్ల: ఓటర్ల జాబితా సమగ్ర పరిశీలన మండలంలో పారదర్శకంగా జరుగుతోంది. బూత్ లెవెల్ ఆఫీసర్లను ఇంటింటికీ వెళ్లి పరిశీలన చేస్తున్నారు. మండలంలో 46,564 మంది ఓటర్లుండగా పరిశీలన తుదిదశకు చేరుకుంది. 396 మంది మరణించిన, 966 మంది డబుల్, డూప్లికేట్ ఓట్లు ఉన్నాయని వెల్లడైంది. పెళ్లి అయిన,గ్రామం వదిలిన, వలస వెళ్లిన వారు 1,525 మంది ఉన్నట్లు తేలింది. అలాగే ఒకే ఇంటి నంబర్‌పై 10 ఓట్లు కన్నా ఎక్కువ ఉన్నా ప్రత్యేకంగా విచారించి వివరాలు సేకరిస్తున్నారు.

సీసీ రోడ్డు నిర్మాణం ప్రారంభం

రుద్రవరం: మండలంలోని ముకుందాపురం గ్రామంలో ఆర్‌అండ్‌బీ రోడ్డుపై రూ.18 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులను కాంట్రాక్టర్ శుక్రవారం ప్రారంభించారు.చిత్రేనిపల్లె పంచాయతీ మజరా గ్రామమైన ముకుందాపురంలో ప్రధాన రహదారి దెబ్బ తినడంతో ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులు ప్రధాన రహదారిపై సీసీరోడ్డు నిర్మించేందుకు రూ.18లక్షలు మంజూరు చేశారు.

ఆరుతడి పంటలు సాగు చేయండి

శిరివెళ్ల: ఆరు తడి పంటలను సాగు చేయాలని ఏఓ సుధాకర్ తెలిపారు. శుక్రవారం వ్యవసాయ మండల సలహా కమిటీ సమావేశం జరిగింది. ఆయన మట్లాడుతూ ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు నెలకొన్నందున మినుము, జొన్న వంటి ఆరుతడి పంటలను మాత్రమే సాగు చేయాలని చెప్పారు. వరి సాగు చేయవద్దని రైతులకు సూచించారు. వెటర్నరీ ఏడీ గిడ్డయ్య,ఏఈఓలు, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

దాతలను మరువరాదు


సుబ్రహ్మణ్యం గుప్తాను సన్మానిస్తున్న దృశ్యం

ఉయ్యాలవాడ: పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఆలయాల నిర్మాణాలు, మసీదులు, చర్చిలకు స్థలాలను విరాళంగా ఇచ్చిన దాతలను ఎప్పటికీ మరువరాదని ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో భవన సముదాయానికి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏర్పాటు కోసం అప్పట్లో 10 ఎకరాల స్థలం విరాళంగా ఇచ్చిన పాలూరు సుబ్బరాయుడు శ్రేష్టి వారసులు పాలూరు సుబ్రహ్మణ్యం గుప్తాను ఘనంగా సన్మానించారు. ఆమె మాట్లాడుతూ వీరి కుటుంబం అందజేసిన స్థలం ఎకరా ప్రస్తుతం ఎంతో విలువ చేస్తుందని చెప్పారు. జెడ్పీటీసీ కసాని పుణ్యలక్ష్మిదేవి, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, పరిపాలనాధికారి పార్థసారథి, ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడి ఎన్నిక

చాగలమర్రి: ఎమ్మార్పీఎస్ నంద్యాల జిల్లా నూతన అధ్యక్షుడిగా వేణుగోపాల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నంద్యాల జిల్లా ఇన్‌చార్జ్ సుభాష్ చంద్రబోస్ శుక్రవారం తెలిపారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు వేణుగోపాల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు.

లింగ నిర్ధారిత వీర్యంతో మేలైన పెయ్యదూడలు


మాట్లాడుతున్న ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి

నంద్యాల(సెంట్రల్): పాడిరైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాల్ని అమలు చేస్తోందని విజయ డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్ మోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక డెయిరీ పరిపాలనా భవనంలో లింగ నిర్ధారిత వీర్యం ద్వారా పెయ్యదూడల్ని ఎలా పొందాలనే అంశంపై ఉమ్మడి కర్నూలు జిల్లా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ ప్రక్రియ ద్వారా ఏడాదికి ఒక దూడను పొందవచ్చని ఉపసంచాలకులు డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ అరుణశ్రీ వివరించారు. పాలలో వెన్నశాతం ఎలా పెంచుకోవాలో సహాయ సంచాలకులు డాక్టర్ సుధాకర్ తెలిపారు. డెయిరీ ఉపసంచాలకులు రాజేష్, పశుసంవర్ధక శాఖ జిల్లా ఉపసంచాలకులు రమణమూర్తి, ఏడీ సుబ్బారెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అప్పీల్ లేని అంతిమ తీర్పు

- రాజీతో ఇరువర్గాలూ గెలుపే..
- సీఆర్‌పీసీలో కాంపౌండబుల్ రాజీ అయ్యే కేసులకు మాత్రమే అవకాశం
- నేడు జాతీయ మెగా లోక్ అదాలత్
- కేసుల పరిష్కారానికి చక్కని అవకాశం

లోక్ అదాలత్..ప్రత్యామ్నాయ వివాద పరిష్కార యంత్రాంగంలో ముఖ్యమైనది. వివాదాలు, కేసులను సామరస్యంగా పరిష్కరించుకునే/రాజీచేసుకునే వేదిక. ఇక్కడ ఇచ్చిన తీర్పుకు అప్పీలు ఉండదు. లోక్ అదాలత్‌లో ఎలాంటి రుసుము లేకుండా కేసులను పరిష్కరిస్తారు. కక్షిదారులకు అవగాహన కల్పించి రాజీ కల్పించడమే దీని ముఖ్య ఉద్దేశం. ముఖ్యంగా పోలీసులు వివిధ కేసుల్లోని కక్షిదారులకు కౌన్సెలింగ్ ఇచ్చి లాభనష్టాలను వివరించి రాజీ అయ్యేలా ప్రోత్సహిస్తున్నారు. నేడు జరిగే కార్యక్రమంలో మరిన్ని కేసులను పరిష్కరించనున్నారు.


పోలీసు అధికారులతో సమావేశమైన ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాసరావు (ఫైల్)

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల కోర్టులో ఈ ఏడాది ఫిబ్రవరి 11వ తేదీన జరిగిన జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమంలో 1,243 కేసులు, మే 13న 1,637 కేసులను పరిష్కరించి లబ్ధిదారులకు కోట్ల రూపాయల పరిహారం అందజేశారు. అలాగే ఈ నెల 9వ తేదీన జాతీయ మెగా లోక్‌అదాలత్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు మండల లీగల్‌సెల్ అధికారులు ప్రకటించారు. పలుమార్లు కోర్టు ఆవరణలో పోలీసు అధికారులు, న్యాయవాదులు, బ్యాంకు అధికారులు, సెబ్, మున్సిపల్ అధికారులతో న్యాయమూర్తులు పలుదఫాలుగా అవగాహన కల్పించి రాజీ అయ్యే కేసులను పరిష్కరించాలని కోరారు. నంద్యాల నియోజకవర్గంలో ఎస్పీ, డీఎస్పీ కార్యాలయాలతో పాటు 6 పోలీస్‌స్టేషన్లలో డీఎస్పీ, సీఐలు, ఎస్‌ఐలు కక్షిదారులకు అవగాహన కల్పిస్తున్నారు. కేసుల్లో రాజీ అవుదాం, మనము, మన ఊరిని ప్రశాంతంగా ఉంచుదాం అంటూ సుప్రీంకోర్టు రాజీ అయ్యేందుకు అవకాశమివ్వటంతో పోలీసులు ఫిర్యాదుదారులు, కక్షిదారులకు కౌన్సెలింగ్ ఇచ్చి రాజీ మార్గానికి కృషి చేస్తున్నారు.

కక్షిదారుల్లో మార్పునకు పోలీసుల కృషి..

కేసులను ఖర్చు లేకుండా త్వరగా పరిష్కరించుకుంటే మంచిదని, లేకపోతే ఎంత మేర ఏఏ విభాగాల్లో నష్టపోవాల్సి ఉంటుందో పోలీసులు వివరిస్తున్నారు. క్షణికావేశంలో భవిష్యత్‌ను అంధకారం చేసుకోవద్దని హితబోధ చేస్తారు. రాజీ కుదుర్చుకోవటం వల్ల కలిగే ప్రయోజనాలు తెలియజేస్తారు. రాజీకి సుముఖత చూపేవారిని పై అధికారుల వద్ద సమావేశ పరచి వారి సాయంతో కేసుల పరిష్కారానికి కృషి చేస్తారు. ఇలా కోర్టులో నిర్వహించే లోక్ అదాలత్‌లో వేలాది కేసుల పరిష్కారం వెనక పోలీసు అధికారులు, న్యాయవాదులతో పాటు ప్రతి పోలీసు స్టేషన్ నుంచి కోర్టు వ్యవహారాలు చూసే కానిస్టేబుల్ రాజీ మంత్రం గట్టిగా పనిచేస్తుంది.

సచివాలయ మహిళా పోలీసుల సహకారం..

సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తేవటంతో కోర్టు పనులు మరింత సులభతరమయ్యాయని పోలీసు అధికారులు చెబుతున్నారు. వివాదాలకు పాల్పడే వారి పూర్తి సమాచారం సేకరణలో సచివా లయ మహిళా పోలీసులు క్షేత్రస్థాయిలో కీలకపాత్ర పోషిస్తున్నారు. కేసుల్లో ఇరువర్గాల వారిని సమావేశపర్చేందుకు, స్టేషన్ నుంచి సకాలంలో సమాచారమిచ్చేందుకు సహాయపడుతున్నారు. రాజీ ప్రయత్నాల్లో కూడా వీరు ప్రధాన భూమిక పోషిస్తున్నారు. నేరగాళ్ల ఉనికిని తెలియజేస్తూ నేర నియంత్రణకు సహకరిస్తున్నారు.

రాజీపడే కేసులు..

సీఆర్‌పీసీ 320 చట్టం కింద రాజీ పడే కేసులు..

323, 334, 335,341, 342, 343, 344, 346, 352, 403, 407, 411, 414, 417, 506 ఈ సెక్షన్ల కింద ఉన్న కేసులు మాత్రమే రాజీ పడే అవకాశం ఉందని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఎక్కువగా గృహహింస, ప్రోనోట్, మోటార్ వెహికల్, మెయింటెనెన్స్, చీటింగ్, చిట్‌ఫండ్, అక్రమ రవాణా, పేకాట, లాక్‌డౌన్, ట్రాఫిక్ రిలేటెడ్, ఫ్యామిలీ రిలేటెడ్ , పెట్టి కేసులు, డ్రంకన్‌డ్రైవ్, ఇన్సూరెన్స్, బ్యాంకు, మున్సిపల్, బీఎస్ఎన్ఎల్, సెబ్ కేసులు పరిష్కారమవుతున్నాయి.

రాజీ వల్ల కలిగే ప్రయోజనాలు వివరిస్తాం



చిన్న చిన్న తగాదాల కేసుల్లో ఇరువర్గాల మేలు కోసం వారిని రాజీ చేసేందుకు అవగాహన కల్పిస్తున్నాం. ఇందుకోసం శనివారం జాతీయ మెగాలోక్ అదాలత్‌ను ఏర్పాటు చేశారు. రాజీ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి అందుకు అంగీకారానికి వస్తే ఆ కేసుల వివరాలను లోక్ అదాలత్ దృష్టికి తీసుకువెళతాం. కుటుంబాల వృద్ధి కోసం, పిల్లల భవిష్యత్, ఆర్థిక పరిస్థితులు, కోపాల వల్లే కలిగే అనర్థాలపై అవగాహన కల్పించి రాజీ పడేలా ప్రోత్సహిస్తాం. ఇరువురి అంగీకారం మేరకే రాజీ కుదురుతుంది. లేదంటే కేసు కొనసాగుతుంది. – రఘువీర్‌రెడ్డి, ఎస్పీ, నంద్యాల

కేసుల పరిష్కారానికి కృషి చేస్తున్నాం



ఎన్నో సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న కేసుల కక్షిదారులను రాజీమార్గానికి న్యాయవాదుల సహకారంతో ప్రయత్నం చేస్తున్నాం. వ్యాజ్యానికి ముందు దశలో ఉన్న ఏదైనా వివాదాన్ని పరిష్కరించటానికి కక్షిదారులకు అవగాహన కల్పిస్తున్నాం. వివాదాల్ని సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవటానికి అవకాశం ఉన్నటువంటి కేసులను లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించేందుకు కృషి చేస్తాం. మోటారు వెహికల్ కేసులు, ప్రోనోట్ కేసులు, ఇన్సూరెన్స్ కేసులు, గృహహింస కేసులపై ఎక్కువగా రాజీ అయ్యేలా ప్రోత్సహిస్తున్నాం. – విజయశేఖరరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, నంద్యాల

వార్డు స్థాయి నుంచే సామరస్యానికి ప్రయత్నం చేస్తున్నాం



పలు వివాదాల్లో నమోదైన కేసులపై వార్డు, గ్రామ స్థాయిలోనే ఇరువర్గాల కుటుంబ సభ్యులకు సామరస్య పూర్వక పరిష్కారాన్ని సూచిస్తున్నాం. చిన్న చిన్న కేసుల్లో రాజీకి మెగాలోక్ అదాలత్ చక్కని వేదిక. భార్యాభర్తల మధ్య కలహాలు వచ్చిన సమయాల్లో పోలీసు స్టేషన్లలో కేసులు నమోదు చేసుకునేందుకు వచ్చిన వారిని గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇస్తుంటాం. తరచూ ప్రజలకు చట్టా లపై అవగాహన కార్యక్రమాల్ని నిర్వహించటం వల్ల చక్కని ఫలితం ఉంటుంది.– భారతి, మహిళా సంరక్షణ కార్యదర్శి, 21వ వార్డు, హరిజనవాడ, నూనెపల్లె

ఐటీఐ నాల్గో విడత అడ్మిషన్లు ప్రారంభం

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ప్రభుత్వ ఐటీఐలో నాల్గో విడత అడ్మిషన్లకు అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఈనెల 8 నుంచి 19వ తేదీ వరకు iti.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తును ప్రింట్ తీసుకొని ఒరిజినల్ సర్టిఫికెట్‌తో 20వ తేదీ లోపు నంద్యాల ప్రభుత్వ ఐటీఐలో వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. లేని పక్షంలో మెరిట్ జాబితాలో అభ్యర్థుల పేర్లను పొందుపరచన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో 22వ తేదీ నంద్యాల ప్రభుత్వ ఐటీఐలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని చెప్పారు. 1సంవత్సరం కోర్సులు మెకానికల్ డీజిల్, వెల్డర్, కండీషన్, రెండు సంవత్సరాల కోర్సులకు (డ్రాఫ్ట్‌మెన్ సివిల్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, రెఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్)దరఖాస్తు చేసుకోవాలన్నారు. పది పాస్, ఫెయిల్ అయిన విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. వివరాలకు సెల్ : 9666712370, 9000767816 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

15న జిల్లా ఫుట్ బాల్ జట్టు ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 15వ తేదీన నంద్యాల జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు ఎస్పీజీ మైదానంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ సంఘం గౌరవాధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, అధ్యక్షుడు వినయ్‌సాగర్, కార్యదర్శి అనిల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.16 ఏళ్లలోపు బాలబాలికలకు పోటీలు ఉంటాయని, క్రీడాకారులు ఆధార్‌కార్డు,జనన ధ్రువపత్రంతో రావాలని సూచించారు.వివరాలకు సెల్: 99636 36876,9985220205నంబర్లలో సంప్రదించాలన్నారు.

ప్రకృతి విధానాలతో నేలకు జీవం

ఆళ్లగడ్డ: ప్రకృతి వ్యవసాయం విధానాలతో నేల సమతుల్యాన్ని కాపాడవచ్చని జిల్లా ఎన్‌పీఏ హెచ్‌ఆర్ కరీంబాషా పేర్కొన్నారు. చాగలమర్రి మండలం చక్రవర్తులపల్లె గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సాగు క్షేత్రంలో శుక్రవారం సాగుదారులకు అవగాహన కార్యాక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మొదటిసారిగా రైతులకు నిరంతరం ఆదాయం వచ్చేలా ఏటీఎం మోడల్, ఏ గ్రేడ్ మోడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. ప్రకృతి వ్యవసాయం నియోజకవర్గ ఇన్‌చార్జ్ అబ్దుల్‌బాషా, యూనిట్ ఇన్‌చార్జ్ జయరామిరెడ్డి ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం


వరలక్ష్మి వ్రతంలో పాల్గొన్న మహిళలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని ప్రథమనంది దేవాలయంలోని గాయత్రీ ఆలయంలో శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా పట్టణ బ్రా హ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీవ్రతం,కుంకుమార్చన నిర్వహించారు. ఉదయాన్నే గాయత్రీ మాతకు ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు.

ఘనంగా శ్రీవ్యాసపూజ..

హరేకృష్ణ మహామంత్రం భగవద్గీత, శ్రీమద్భాగవతము, ఉపదేశములను, శ్రీకృష్ణ లీలలను ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం చేసిన ఏసీ భక్తి వేదాంతస్వామి పాదుల వారి 127వ ఆవిర్భావాన్ని పురస్కరించుకొని చైతన్య మహాప్రభు మూమెంట్ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం


మాట్లాడుతున్న తహసీల్దార్ రవికుమార్

ఉయ్యాలవాడ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. గ్రామాల్లోని సమస్యలను ప్రజాప్రతినిధులు ప్రస్తావిస్తూ.. ఎన్నిసార్లు చెప్పి నా అధికారులు పరిష్కరిండం లేదని అసహనం వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధుల మాటను గౌరవించడం లేదని సభదృష్టికి తెచ్చారు. గత సమావేశాల్లో లేవనెత్తిన సమస్యలను ఎందుకు పరిష్కరించలేదని కొందరు నిలదీయగా.. అధికారులు నీళ్ల నమిలా రు. ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ముందుగా అజెండాలో పొందుపరచిన ప్రకారం ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు సూచన మేరకు వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. తహసీల్దార్ రవికుమార్ మాట్లాడుతూ జగనన్న భూ రీసర్వే సర్వే 5 గ్రామాల్లో పూర్తి చేశామన్నారు. రైతులకు భూరక్ష పత్రాలను త్వరలో అందజేస్తామని పేర్కొన్నారు. హరివరం ఎంపీటీసీ సభ్యుడు పెద్ద పేరయ్య, పలువురు గ్రామాల సర్పంచ్‌లు మాట్లాడుతూ శ్మశనాలు లేవని, ఉన్నవి అన్యక్రాంతమవుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఉయ్యాలవా డలో ఆర్యవైశ్యులు, బ్రాహ్మణులకు కేటాయించిన శ్మశానం ప్రస్తుతం ఖననం చేసేందుకు కూడా వీలు లేకుండా పోయిందన్నారు. ఆ స్థలంలో కొందరు పంటలు సాగు చేస్తున్నారన్నారు. ఆర్.జంబులదిన్నె బీసీ కాలనీలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని మూడు సమావేశాల్లో కోరినా చర్యలు లేవని సర్పంచ్ ప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు బాలిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఆయా గ్రామాలకు విద్యార్థుల కోసం బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతున్నా ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. వైద్యాధికారి రమేష్ చంద్ర బాలాజీ, జెడ్పీటీసీ కసాని పుణ్యలక్ష్మిదేవి, మండల కోఆప్షన్ మెంబర్ అమీర్ అహమ్మద్, ఎంపీటీసీ సభ్యులు, ఆర్‌అండ్‌బీ డీఈ సునీల్‌రెడ్డి, ఏఓ రాజేంద్రకుమార్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

నంద్యాల(అర్బన్): నంద్యాల మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు ఆధ్వర్యంలో అధికారులు శుక్రవారం సాయంత్రం పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలు, క్రిమిసంహారక మందుల విక్రయాల దుకాణాలపై దాడులు నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు చూపని హర్షిత ఎంటర్‌ప్రైజెస్, వీరభద్రస్వామి ఫెర్టిలైజర్స్‌లలోని రూ.5.50 లక్షల విలువజేసే ఎరువుల అమ్మకాలను నిలిపి వేశారు.

ఎస్సీ వర్గీకరణ సాధిస్తాం

నంద్యాల(అర్బన్): ఎస్సీ వర్గీకరణను సాధిస్తామని వికలాంగుల హక్కుల పోరాట సమితి నంద్యాల జిల్లా అధ్యక్షుడు గంగాధర్‌శెట్టి తెలిపారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక కలెక్టర్ కార్యాలయం ఎదుట వీహెచ్‌పీఎస్, ఎమ్మార్పీఎస్, మహాజన సోషలిస్ట్ పార్టీల ఆధ్వర్యంలో రిలే దీక్షలు ప్రారంభమయ్యాయి.

గిరిజనుల సంక్షేమమే ధ్యేయం

ఆళ్లగడ్డ: చెంచు గిరిజనుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, సద్వినియోగం చేసుకొని వృద్ధిలోకి రావాలని ఎంపీడీఓ మహబూబ్‌ఖాన్ సూచించారు. అహోబిలం చెంచు గిరిజన గూడేల్లో శుక్రవారం చెంచుల జీవన స్థితిగతులపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైస్ ఎంపీపీ నాసారి ప్రసాద్ పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నియామకం

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రధాన కార్యదర్శిగా జిల్లా కో ఆపరేటివ్ సొసైటీ అధికారి వెంకటసుబ్బయ్యను రాష్ట్ర గవర్నర్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నియమించారు. ఈ సందర్భంగా నంద్యాల రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు ఆయన కార్యాలయంలో శాలువా, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో మారుమూల ప్రాంతాల్లో సంస్థ సేవలు అందించడానికి తనవంతు సహకారం అందజేస్తానన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ దస్తగిరి, అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి, కోశాధికారి నాగేశ్వరరావు, సోహేల్, డీఎఫ్ఓ రాజునాయక్ పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై జాగ్రత్త


మాట్లాడతున్న డీఎస్పీ వెంకట్రామయ్య

ఆళ్లగడ్డ: సైబర్ మోసాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఆళ్లగడ్డ డీఎస్పీ వెంకట్రామయ్య సూచించారు. స్థానిక కేవీ సుబ్బారెడ్డి విద్యాలయంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించి విద్యార్థులకు చట్టాల గురించి వివరించి, పలు సూచనలు చేశారు. ఆయన మట్లాడుతూ సామాజిక మాధ్యమాల్లో అపరిచిత వ్యక్తులతో పరిచయాలు పెంచుకొని వ్యక్తిగత విషయాలు పంచుకోవద్దని చెప్పారు. సీఐ రమేష్‌బాబు, ఎస్‌ఐ వెంకటరెడ్డి, శక్తి టీం సభ్యులు ఉన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

చాగలమర్రి: స్థానిక బుగ్గ రస్తా వీధిలోనున్న 16వ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన సదస్సు నిర్వహించారు.

నంద్యాల చరిత్రలో సువర్ణ అధ్యాయం


లెక్చరర్ హాల్‌ను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల టౌన్: నంద్యాల జిల్లా ప్రజల చిరకాల కల నెరవేరిన వేళ.. నంద్యాల చరిత్రలో సువర్ణ అధ్యాయంగా మిగిలిపోయే రోజు ఇదేనని ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని మెడికల్ కళాశాలను ఈనెల 14వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వర్చువల్ విధానంలో ప్రారంభించనున్న నేపథ్యంలో శుక్రవారం ఎమ్మెల్యే మెడికల్ కళాశాలను సందర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీ ప్రణవానందకుమార్‌తో కలిసి వైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన వసతులు, బయో కెమిస్ట్రీ, అనాటమీ, ఫిజియాలజీ ల్యాబ్‌లలో ఏర్పాటు చేసిన పరికరాలను తనిఖీ చేశారు. అనంతరం లెక్చరర్ హాల్‌లో విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని వాటిని సాధించేందుకు కృషి చేయాలని కోరారు. నేర్చుకున్న వైద్య విద్య ద్వారా ప్రజలకు ఉత్తమ సేవలందించి వారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్ది ఆదర్శంగా నిలవాలని సూచించారు. ప్రతి పౌరుడు ఆరోగ్యంగా ఉండాలని లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వైద్య కళాశాల ఏర్పాటుచేసి అనుబంధంగా ఆసుపత్రుని కూడా నిర్మించిందని చెప్పారు. ఉత్తమ కళాశాలగా పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చేందుకు ప్రొఫెసర్లు, విద్యార్థులు కృషిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కళాశాలలో ప్రథమ సంవత్సం అడ్మిషన్ పొందిన విద్యార్థులకు స్వాగతం పలికారు. కళాశాల అభివృద్ధికి రానున్న రోజుల్లో చేపట్టనున్న వివిధ కార్యక్రమాలను వివరించారు.

అడవి జంతువులకు హాని తల పెట్టొద్దు

రుద్రవరం: అడవి జంతువులకు హాని తలపెట్టొద్దని రుద్రవరం రేంజ్ ఇన్‌చార్జ్ అధికారి త్రినాథ్‌రెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని పందిర్లపల్లె సమీపంలో వెంకటేశ్వర్లు అనే రైతుకు చెందిన మొక్క జొన్న పంటను అడవి జంతువులు ధ్వంసం చేశాయి. బాధిత రైతు అటవీ అధికారులకు సమాచారమివ్వడంతో రేంజర్ తన సిబ్బంది ఎఫ్ఎస్ఓ శ్రీనివాసరెడ్డి,ఎఫ్‌బీఓలు సురేంద్ర గౌడ్,చాణక్యుడులతో పాటు వ్యవసాయ శాఖ సిబ్బందితో కలిసి శుక్రవారం పొలం వద్దకు వెళ్లి దెబ్బతిన్న పంటను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందజేస్తామని భరోసా ఇచ్చారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

చాగలమర్రి: పంటలు సాగు చేసిన రైతులందరూ ఈ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించకోవాలని ఆళ్లగడ్డ ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. చాగలమర్రిలోని ఆర్బీకే-2లో శుక్రవారం ఏఓ రంగ నేతాజీ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల వ్యవసాయ సలహా మండలి సమావేశంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ లోపు ఈ క్రాప్ చేయించుకోవాలని చెప్పారు.

కృత్రిమ గర్భధారణతో మేలైన పశుసంపద

ఆళ్లగడ్డ: మేలు జాతి పశుసంపద అభివృద్ధికి కృత్రిమ గర్భాధారణ పద్ధతిని అనుసరిస్తున్నట్లు పశుగణాభివృద్ధి సంస్థ ప్రత్యేకాధికారి డాక్టర్ లావణ్య లక్ష్మి తెలిపారు. శుక్రవారం నియోజకవర్గంలోని పలు గ్రామీణ పశు వైద్యశాలలను తనిఖీ చేశారు. అనంతరం పట్టణంలోని పశు వైద్యశాల, వైఎస్సార్ పశు వ్యాధినిర్ధారణ కేంద్రాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది సమన్వయంతో నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ఆర్బీకేల ద్వారా దాణా విత్తనాలను పశు పోషకులకు అందించాలని చెప్పారు.డీడీ డాక్టర్ రమణయ్య, ఏడీ కొండారెడ్డి ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ 1938 రాష్ట్ర కార్యదర్శి నగరి శ్రీనివాసులు, నంద్యాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాధవస్వామి, సాంబశివుడు కోరారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. ఉపాధ్యాయులకు జీతాలు వెంటనే చెల్లించాలని, ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రావాల్సిన డీఏలు ఇవ్వాలన్నారు.

ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ


పట్టా అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(అర్బన్): గత ప్రభుత్వ హయాంలో టీడీపీ సానుభూతి పరులకు మాత్రమే ఇళ్ల స్థలాలు దక్కేవని, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఘనత జగనన్నదేనని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పుసులూరు గ్రామానికి చెందిన అర్హులైన ఐదు కుటుంబాలకు స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రామసుబ్బయ్య, ఎంపీటీసీ సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'ను జయప్రదం చేయండి

చాగలమర్రి: ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మండలంలో జయప్రదం చేయాలని స్థానిక ప్రభుత్వ వైద్యురాలు అంజలి పిలుపునిచ్చారు. శుక్రవారం ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, తహసీల్దార్ సుభద్రమ్మ అధ్యక్షతన ఎంపీడీఓ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, పంచాయతీ కార్యదర్శులకు ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభం కానున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించారు. 16వ తేదీ నుంచి వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ల పరిధిలో ఏఎన్ఎం, సీహెచ్‌ఓలు ఇంటింటినీ సందర్శించి ప్రజలకు ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య సమస్యలు గుర్తించి ఫలితాలను వైద్యులకు అందుబాటులో ఉంచాలని చెప్పారు. ఆ తరువాత ఆరోగ్య సమస్యలున్న వారు వైద్య శిబిరాలకు హాజరయ్యేలా టోకెన్ నంబర్లు ఇవ్వాలని సూచించారు. ఈ నెల 30 నుంచి ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను వైద్య, ఆరోగ్య శాఖ ఏర్పాటు చేస్తారని వివరించారు.

సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న ఏడీఏ రాజశేఖర్

నంద్యాల(అర్బన్): వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటల సాగుకు అందించే జొన్న, మొక్కజొన్న, మినుము పంటల సబ్సిడీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ రాజశేఖర్ కోరారు. స్థానిక మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో శుక్రవారం నంద్యాల మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. మండలి అధ్యక్షుడు చిన్న తిరుపతిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏడీఏ మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులను నేరుగా ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్ చేయించుకొని తీసుకోవచ్చన్నారు. హార్టికల్చర్ అధికారి శ్రీధర్ మాట్లాడుతూ సబ్సిడీపై పవర్ స్ప్రేయర్లు, టార్పాలిన్ పట్టాలను అందిస్తున్నట్లు చెప్పారు. పశువైద్యాధికారి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

అర్చక శిక్షకులకు అభినందనలు

నంద్యాల(వ్యవసాయం): టీటీడీ శ్రీవాణి ట్రస్టు సహాయంతో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లాకు చెందిన 29 మంది తిరుపతిలో అర్చక శిక్షణ పొంది నంద్యాలకు చేరుకున్న సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు శుక్రవారం వారికి స్వాగత, అభినందనలు తెలిపారు. జిల్లా బాలవికాస్ ఉపాధ్యాయ కన్వీనర్, సహ కన్వీనర్లు తిమ్మారెడ్డి, చంద్రశేఖర్ మాట్లాడుతూ జిల్లాలో 22 దేవాలయాల్లో అర్చకత్వం, పూజా కైంకర్యాలు నిర్వహించడానికి ఎస్సీ, ఎస్టీకి చెందిన మహిళలకు శిక్షణ ఇచ్చారు. వీరు జిల్లాలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 22 దేవాలయాల్లో అర్చకులుగా కొనసాగుతారని తెలిపారు.